# ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్యం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**
**డయాలసిస్ కేంద్రానికి నేటి నుంచి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా**
**ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి**





**నాగర్ కర్నూల్ మే 16: (నినాదం) :** పేద, మధ్యతరగతి ప్రజలు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా, ప్రభుత్వ వైద్యశాలల్లోనే అన్ని రకాల వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, రోగులకు అందుతున్న సేవలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. డయాలసిస్ రోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను పరిష్కరిస్తూ, ఆసుపత్రికి నేటి నుంచే 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాను అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి ప్రకటించారు. ప్రజలు వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ దవాఖానాల్లోనే అన్ని వసతులు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. రూపాయి ఖర్చు లేకుండా ఆధునిక వైద్య సేవలు, పరీక్షలు, నాణ్యమైన మందులు ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రిలో త్వరలోనే పూర్తిస్థాయి సేవలను మరింత విస్తృతం చేస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ అంతరాయం కారణంగా డయాలసిస్ రోగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, వారి కోసం ప్రత్యేక విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయించినట్లు మంత్రి వెల్లడించారు. నేటి నుంచి ఎలాంటి బ్రేక్ లేకుండా 24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. దీనివల్ల రోగులకు సకాలంలో, సురక్షితంగా వైద్యం అందుతుందన్నారు. అలాగే డయాలసిస్ కేంద్రంలో అదనపు బెడ్లు, ఏసీల ఏర్పాటుతో పాటు రోగుల కోసం ప్రత్యేకంగా మరో అంబులెన్స్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. గత 2018 సంవత్సరంలో రూ.22 కోట్ల వ్యయంతో మంజూరైన 100 పడకల నూతన ఆసుపత్రి భవన పనులు పూర్తయ్యాయని, త్వరలోనే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా దీనిని ప్రారంభించనున్నట్లు జూపల్లి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం ఆసుపత్రి వద్ద రూ.5 లక్షల వ్యయంతో నూతన బస్ షెల్టర్ నిర్మిస్తున్నామని, స్థానిక ప్రజాప్రతినిధులు ఆసుపత్రిని నిరంతరం పర్యవేక్షిస్తూ రోగులకు అండగా ఉండాలని మంత్రి సూచించారు.

# ఓటరు జాబితా పరిశీలనలో ప్రత్యేక చర్యలు

**నాగర్ కర్నూల్ కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**నాగర్ కర్నూల్ మే 16 (నినాదం) :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా ఎన్నికల అధికారులు (ఐజూం), ఎన్నికల నమోదు అధికారులు తో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఎఎస్ శనివారం హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం త్వరలో ప్రకటించనున్నందున, మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి పురోగతి సాధించాలని కలెక్టర్లు, ఐజూం లను ఆయన ఆదేశించారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ హాజరై మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 75 శాతం మ్యాపింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటరు జాబితాల పరిశీలన, బూత్‌ల వారీగా వివరాల సేకరణ, సిబ్బంది సమన్వయం వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా స్థాయిలో చేపడుతున్న ఏర్పాట్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డికు వివరించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, సర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని, అందుకోసం వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై పార్టీలకు సూచనలు చేయనున్నట్లు, జిల్లాలో పెరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, సంబంధిత పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని అదనంగా ముగ్గురు సహాయ అధికారులను నియమించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ని కోరారు. అదనపు అధికారుల నియామకం ద్వారా మ్యాపింగ్, ఓటరు జాబితా పరిశీలన, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి దశను కచ్చితంగా అమలు చేస్తూ, స్వచ్ఛమైన మరియు నిష్పాక్షిక ఓటర్ జాబితా రూపకల్పనకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఆర్డీవోలు సురేష్ బాబు, యాదగిరి, బన్సీలాల్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు



# 18న ప్రజావాణి రద్దు

**గద్వాల బ్యూరో మే 16 ( నినాదం) :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 18న రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దిశా కమిటీ సమావేశము మరియు భారీ వరదలు, విపత్కర సంఘటనలు సంభవించే సమయంలో సంబంధిత శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై ఈనెల 18న జిల్లాలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం మొత్తం అక్కడే ఉంటున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. ఈనెల 25న యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలియజేసినారు.

# భక్తులతో కిటకిటలాడిన శ్రీ స్వయంభు మిట్టభక్తాంజనేయ స్వామి దేవస్థానం

## అంగరంగ వైభవంగా మండల పూజా మహోత్సవాలు


**పెబ్బేరు మే 16 (నినాదం):** పురపట్టణ ఆరాధ్య దైవమైన శ్రీ స్వయంభు మిట్టభక్తాంజనేయ స్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం, నవగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాల అనంతరం నిర్వహిస్తున్న మండల పూజా కార్యక్రమాలు శనివారం వైభవంగా ముగిశాయి. వైశాఖ అమావాస్య శనివారం పురస్కరించు కొని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, పత్రపూజలు, నవగ్రహ హోమం, మన్యుసూక్త హోమం, ధ్వజస్తంభ హోమం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాల ఘోషణలు, భక్తుల శ్రీరామనామ సంకీర్తనలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగాయి. మండల పూజల ముగింపు సందర్భంగా స్వామివారి దర్శనార్థం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజ్లో పాల్గొన్నారు. ఆలయం భక్తులతో కిటకిటలాడగా, అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. వైశాఖ అమావాస్య, శనివారం కలిసి రావడంతో ఈ పూజా కార్యక్రమాలకు విశేష ప్రాధాన్యత ఏర్పడిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



**ప్రముఖ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి, విద్యావేత్త, శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి కుటుంబానికి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న క్రేజ్ ప్రత్యేకమైంది. ఆ కుటుంబం నుంచి వచ్చిన ప్రతి ఒక్కరూ సమాజంలో తమదైన ముద్ర వేస్తున్నారు. ఆ కోవలోనే మల్లారెడ్డి కోడలు, యువ నాయకురాలు డాక్టర్ ప్రీతి రెడ్డి నేడు సమాజంలో ఒక విలక్షణమైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. కేవలం ఒక పెద్ద రాజకీయ, పారిశ్రామిక కుటుంబానికి చెందిన కోడలిగానే కాకుండా, తనకంటూ ప్రత్యేకమైన లీడర్షిప్ ప్రొఫైల్ను ఆమె నిర్మించుకున్నారు. చురుకైన వ్యక్తిత్వం, సేవా దృక్పథం, సమాజం పట్ల ఉన్న బాధ్యత ఆమెను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. మల్లారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూనే యువతకు, మహిళలకు ఆమె ఒక రోల్ మోడల్‌గా నిలుస్తున్నారు.**

# నాయకత్వమే నైజం..

# సేవే లక్ష్యం



## మల్లారెడ్డి కోడలు 'ప్రీతి రెడ్డి'తో ప్రత్యేక ముఖాముఖి

మల్లారెడ్డి విద్యాసంస్థల గ్రూప్లో ఆమె కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆధునిక విద్యా విధానాలను సంస్థల్లో ప్రవేశపెట్టడంలో ఆమె ఎప్పుడూ ముందుంటారు. విద్యార్థులకు కేవలం చదువే కాకుండా, వారిలో నైపుణ్యాలను పెంపొందించడంపై ఆమె ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. క్యాంపస్లలో అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించడంలో ఆమె పాత్ర ఎంతో ఉంది. నిరంతరం విద్యార్థులతో, అధ్యాపకులతో మమేకమవుతూ సంస్థల పురోగతికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. విద్యా రంగంలో ఆమె చూపిస్తున్న చొరవ ఎందరో విద్యావేత్తల ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రీతి రెడ్డికి సామాజిక సేవా కార్యక్రమాలంటే ఎంతో మక్కువ. ముఖ్యంగా మహిళా సాధికారత కోసం ఆమె నిరంతరం ఆలోచిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎక్కడ ఏ కష్టం వచ్చినా స్పందించి, తన పరిధిలో సహాయం చేయడానికి ఆమె ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. మల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు సహాయ కార్యక్రమాల్లో ఆమె చురుగ్గా పాల్గొంటున్నారు. రాజకీయ, వ్యాపార రంగాల్లో మహిళలు మరింత ముందుకు రావాలని ఆమె బలంగా ఆకాంక్షిస్తున్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో ప్రీతి రెడ్డికి ప్రజలతో ప్రత్యేకమైన అనుబంధం ఉంది. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యలు తెలుసుకోవడం ఆమెకు అలవాటు. ముఖ్యంగా నియోజకవర్గంలో మహిళలు ఆమెను తమ ఆడబిడ్డలా భావిస్తారు. మల్లారెడ్డి గారి రాజకీయ వారసత్వాన్ని పంచుకుంటూనే, తనదైన శైలిలో ప్రజల్లోకి వెళ్తున్నారు. పబ్లిక మీటింగ్స్లో ఆమె మాట్లాడే తీరు, సమస్యలను అర్థం చేసుకునే విధానం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. భవిష్యత్తులో ఆమె రాజకీయంగా మరిన్ని కీలక బాధ్యతలు చేపట్టగల నాయకురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటు కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే, అటు విద్యాసంస్థల నిర్వహణ, మరోవైపు సామాజిక, రాజకీయ రంగాల్లో రాణిస్తున్న ప్రీతి రెడ్డి ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం. నిరాడంబరత, కష్టపడే తత్వం, స్పష్టమైన విజన్ ఉన్న నాయకురాలిగా ఆమె ఎదుగుతున్నారు. నేడు మన పత్రికకు ఇచ్చిన ఈ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె తన వ్యక్తిగత జీవితం, విద్యాసంస్థల భవిష్యత్తు ప్రణాళికలు, రాజకీయ ఆశయాలు, సామాజిక సేవ గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు.

**నినాదం :** మల్లారెడ్డి కోడలిగా ఇంట్లోకి వచ్చిన తర్వాత మీ జీవితంలో ఎలాంటి మార్పులు వచ్చాయి



**ప్రీతి రెడ్డి :** నాకు చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి ఇంటికి కోడలిగా రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నేను పూణె నుంచి వచ్చినప్పటికీ, ఎవరూ నన్ను పరాయి రాష్ట్రం నుంచి వచ్చిన అమ్మాయిలా చూడలేదు. తెలంగాణలో పుట్టి పెరిగిన ఒక బిడ్డలా చూసుకుంటున్నారు.

**నినాదం:** మీ ఆశయాలకు కుటుంబం నుంచి ఎలాంటి మద్దతు లభిస్తోంది

**ప్రీతి రెడ్డి :** మా ఇంట్లో ప్రతి విషయంలో కూడా మా మామ మల్లారెడ్డి ఒక అడుగు ముందుంటారు. ముఖ్యంగా ఇంట్లో ఉన్న మహిళలు బయటకు వెళ్లి పని చేయాలని ప్రోత్సహిస్తుంటారు. మహిళలకు సమాన అవకాశాలు, స్వేచ్ఛ ఇవ్వడం చాలా గొప్ప విషయం. చాలా కుటుంబాల్లో ఇది ఉండదు. మహిళలు ప్రోత్సహించే కుటుంబంలో ఉండటం నా అదృష్టం గా భావిస్తున్నాను.

**నినాదం:** మల్లారెడ్డి విద్యా సంస్థల నిర్వహణలో మీ పాత్ర ఏంటి ముఖ్యంగా సాంకేతిక విద్య కోసం మీరు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు ఏమిటి

**ప్రీతి రెడ్డి :** ఇక్కడికి వచ్చిన తర్వాత మెడికల్ కాలేజ్ స్థాపనలో భాగమయ్యాను. మా మామ కల అయిన మెడికల్ కాలేజ్ను ప్రారంభించి, తర్వాత డెంటల్, నర్సింగ్ తదితర కాలేజీలను కూడా ఏర్పాటు చేశాం. ఇప్పుడు వాటిని యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్లే దిశగా కుటుంబ సభ్యులంతా కలిసి కృషి చేస్తున్నాం. ఈ రోజుల్లో టెక్నాలజీ నేర్చుకోవడం చాలా అవసరం. బీటెక, ఎంబీబీఎస్, డెంటల్ చదవడం మాత్రమే కాకుండా, కొత్త టెక్నాలజీలపై అవగాహన ఉండాలి. అందుకే మా యూనివర్సిటీల్లోను కరిక్యులం భాగం చేశాం. మెడికల్ రంగంలో కూడా A వల్ల పేషెంట్ మానిటరింగ్, రికార్డ్స్ నిర్వహణ, పర్సనలైజ్డ్ ట్రీట్మెంట్ వంటి అనేక విషయాలు సులభమవుతాయి. విద్యార్థులు ఆధునిక టెక్నాలజీ నేర్చుకోవడం తో పాటు భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలను కూడా మర్చిపోవద్దని కోరుకుంటున్నాను.

**నినాదం:** నేటి యువతకు, ముఖ్యంగా మహిళా సాధికారత గురించి మీరు చెప్పాలనుకున్న సందేశం ఏమిటి

**ప్రీతి రెడ్డి :** మహిళలు ముందుగా తమ నాలెడ్జ్ పెంచుకోవాలి. కేవలం గాసిప్స్ కాకుండా, తమకు ఇష్టమైన రంగంలో లోతైన అవగాహన పెంచుకోవాలి. అది ఎడ్యుకేషన్ కావచ్చు, మీడియా కావచ్చు, డిజైన్ కావచ్చు. నాలెడ్జ్ పెరిగితే కాన్ఫిడెన్స్ వస్తుంది. కాన్ఫిడెన్స్ ఉంటే మహిళలు ధైర్యంగా ముందుకు సాగ గలుగుతారు. అలాగే మహిళలు ఫైనాన్షియల్ ఇండిపెండెంట్గా ఉండాలి. అంటే కుటుంబాన్ని గౌరవించకుండా కాదు, కానీ అవసరమైన సమయంలో తమ కాళ్లపై తాము నిలబడగలగాలి. అదే నిజమైన మహిళా సాధికారత.

**నినాదం :** వర్క్ ప్రెషర్ మధ్య మీరు ఎలా రిలాక్స అవుతారు

**ప్రీతి రెడ్డి :** డైలీ లైఫ్లో ప్రతి విషయానికీ సమయం కేటాయించాలి. ఉదయం యోగా, ఫిజికల్ ఎక్సర్సైజ్ తప్పనిసరి. మన ఆరోగ్యం బాగుంటేనే కుటుంబాన్ని, ఆఫీస్ను, సమాజాన్ని చూసుకో గలం. ఇంటికి వచ్చిన తర్వాత ఆఫీస్ పనులను పక్కన పెట్టి పిల్లలతో గడపాలి. మహిళలు మల్టీ టాస్కింగ్ చేయగలరు. అదే మహిళల ప్రత్యేకత. జీవితంలోని ప్రతి అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలి.



**నినాదం:** మల్లారెడ్డి కోడలిగా కాకుండా ఒక డాక్టర్గా, విద్యావేత్తగా మీ విజన్ ఏమిటి

**ప్రీతి రెడ్డి :** స్కిల్ ఎడ్యుకేషన్ చాలా ముఖ్యం. ఇప్పుడు విద్య అందరికీ అందుబాటులో ఉంది. కానీ స్కిల్, టెక్నాలజీకి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామనేదే అసలు విషయం. విద్యార్థుల భవిష్యత్తు బంగారు మయం అయ్యేలా, వారికి ఉద్యోగ, ఉపాధి లభించేలా విద్య ఉండాలి.

**నినాదం:** వచ్చే ఐదేళ్లలో మల్లారెడ్డి యూనివర్సిటీ సాధించాల్సిన ప్రధాన లక్ష్యం ఏమిటి

**ప్రీతి రెడ్డి :** మేము ప్రత్యేకంగా ఐదేళ్ల రోడ్మ్యాప్ అనేది పెట్టుకోలేదు. ప్రతి రోజూ కొత్త మార్పులు, కొత్త ఆలోచనలు వస్తుంటాయి. మంచి ఐడియా వచ్చిన వెంటనే అమలు చేస్తాం. ఇప్పుడు పరిస్థితులు చాలా వేగంగా మారుతున్నాయి. అందుకే ప్రతి రోజూ కొత్తగా ఆలోచిస్తూ ముందుకు వెళ్లుతున్నాం.

**నినాదం:** గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించాలంటే ఏమి చేయాలి

**ప్రీతి రెడ్డి :** ముందుగా ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు బలపడాలి. ఎందుకంటే విద్యార్థులు అక్కడి నుంచే కాలేజీలకు వస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపడాలి. అలాగే ప్రైవేట్ సంస్థలు కూడా ప్రభుత్వ పాఠశాలలకు సహకరించాలని కోరుకుంటున్నాను.

**నినాదం:** ఇటీవల రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ప్రజా జీవితంలోకి రావాలి అన్న ఆలోచన ఎలా వచ్చింది

**ప్రీతి రెడ్డి :** మామ కోసం క్యాంపెయినింగ్ చేస్తున్నప్పుడు ప్రజల సమస్యలు దగ్గరగా చూసాను. నీళ్లు, కరెంట్, రైతుల సమస్యలు, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అంశాలపై ప్రజలకు ఎన్నో ఇబ్బందులు ఉన్నాయి. వాటిని పరిష్కరించాలనే ఆశయం ఉంది. రాజకీయాల కంటే మంచి పరిపాలన ముఖ్యమని నేను భావిస్తున్నాను.

**నినాదం:** రాజకీయం అంటే పురుషాధిక్య రంగమనే అభిప్రాయం ఉంది. దీనిని మహిళా నాయకురాలిగా ఎలా చూస్తారు

**ప్రీతి రెడ్డి :** ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారు. సోషల్ మీడియా వల్ల రాజకీయాలపై అవగాహన పెరిగింది. మహిళలు కూడా నాయకత్వ బాధ్యతలు తీసుకుంటున్నారు. భవిష్యత్తులో మహిళా బిల్లు పూర్తిగా అమలైతే మహిళలకు మరింత స్పష్టమైన అవకాశాలు వస్తాయి.

**నినాదం:** వర్క్ లైఫ్, ఫ్యామిలీ లైఫ్ను ఎలా బ్యాలెన్స్ చేస్తారు

**ప్రీతి రెడ్డి :** పని చేసే సమయంలో పనికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇంటికి వచ్చిన తర్వాత కుటుంబానికి సమయం కేటాయించాలి. మన మనసును అలా ట్రైన్ చేసుకోవాలి.

**నినాదం:** భవిష్యత్తులో మిమ్మల్ని పూర్తి స్థాయి రాజకీయ నాయకురాలిగా చూడొచ్చా

**సమాధానం:** చూద్దాం... అవకాశం వచ్చినప్పుడు ఆలోచిస్తా..

## రాపిడ్ ఫైర్..

**నినాదం:** కొత్త ఇంటికి వచ్చే అమ్మాయిల గురించి మీ అభిప్రాయం

**ప్రీతి రెడ్డి :** పెళ్లి చేసుకుని కొత్త ఇంటికి వచ్చే ప్రతి అమ్మాయిని పసిబిడ్డలా చూడాలి. వాళ్లు తమ అమ్మానాన్నలను వదిలి ఎంతో నమ్మకంతో కొత్త కుటుంబంలోకి వస్తారు. అందుకే ప్రేమగా చూసుకోవాలి.

**నినాదం:** డాక్టర్ గా, విద్యావేత్తగా, రాజకీయ నాయకురాలిగా – ఈ మూడింటిలో మీకు అత్యంత సంతృప్తి ఇచ్చిన పాత్ర ఏది

**ప్రీతి రెడ్డి :** ఖచ్చితంగా విద్యావేత్తనే. ఎందుకంటే మంచి డాక్టర్లు, మంచి రాజకీయ నాయకులను సృష్టించే శక్తి విద్యకు ఉంది.

**నినాదం:** ఫిట్నెస్ సీక్రెట్

**ప్రీతి రెడ్డి :** యోగా, పాజిటివ్ థాట్స్.

**నినాదం:** ఫేవరెట్ ఫుడ్

**ప్రీతి రెడ్డి :** బిసిబేళా బాత్, రాగి ముద్ద.

**నినాదం:** మీ సక్సెస్ మంత్ర

**ప్రీతి రెడ్డి :** "Everything is possible." మీరు చేయాలనే నిర్ణయం తీసుకుని దాని కోసం కష్టపడితే అసాధ్యం అనేది ఏదీ లేదు.

**నినాదం:** ఒక్క మాటలో మల్లారెడ్డి గారి గురించి

**ప్రీతి రెడ్డి :** హి ఈజ్ గాడ్ ఫాదర్ టు మీ. ఫాదర్–ఇన్–లా మాత్రమే కాదు, తండ్రిలా ఉంటారు.

**నినాదం:** మీకు హ్యాపీనెస్ ఇచ్చే విషయం ఏమిటి

**ప్రీతి రెడ్డి :** ప్రతి క్షణం నాకు ఆనందమే. సింగింగ్, డాన్సింగ్, ప్రజలతో మాట్లాడటం, పుస్తకాలు చదవడం, కొత్త విషయాలు నేర్చుకోవడం... ఇలా ప్రతి విషయంలో ఆనందాన్ని వెతుక్కుంటాను.

**ఇంటర్వ్యూ :**
**గుంపుల ఇందిరా ప్రియదర్శిని యాదవ్,**
**(నినాదం బ్యూరో చీఫ్)**



Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028 Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787